## క్లుప్తంగా

### శ్రీమఠంలో ఉడిపి పీఠాధిపతులు



రాఘవేంద్ర స్వామి దర్శనంలో పీఠాధిపతులు

మంత్రాలయం : ధనుర్మాసం సందర్భంగా కర్ణాటకలోని ఉడిపి మఠం పీఠాధిపతి సుగుణేంద్రతీర్థులు, పుట్టిగె మఠం ఉత్తరాధికారి సుశ్రీంద్ర తీర్థులు మంత్రాలయంకు విచ్చేశారు. బుధవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు నేతృత్వంలో స్వామీజీలకు మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రుల మూల బృంధావనానికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఊంజల మంటపంలో స్వామీజీలను సత్కరించి ఉభయులకు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



బూదూరులో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం : గ్రామాల్లో కక్షలు మాని ప్రశాంతంగా జీవించాలని, అల్లర్లుకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. బుధవారం మండలంలోని బూదూరు గ్రామంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజుతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

### బహుమతుల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సుధాకర్‌కుమార్

ఆదోనిఅర్బన్: ఇంధనం పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి విద్యుత్ శాఖ డీఈఈ సుధాకర్‌కుమార్, ఏడీఈ పురుషోత్తం పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు.

# సమస్యల పరిష్కారానికే గడప గడపకు





లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ప్రజలతో మాట్లాడుతున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇలాంటి కార్యక్రమం దేశంలో ఇంతకు ముందెన్నడూ లేదని, జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పాలన సాగిస్తుందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఆయన తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఇద్దరూ వేర్వేరుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 33వ వార్డు ఖాజీపుర, పాత పోస్టాఫీసు ఏరియాల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, 15వ వార్డు కొడలపేటలో మనోజ్ కుమార్‌రెడ్డితో పాటు చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు, పాలన తీరు, టీడీపీ హయంలో పాలనతో పోల్చి వివరించారు. అలాగే సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వ బడుల్లో వసతులు లేక, ఉపాధ్యాయులు లేక మూతబడ్డాయని, కేవలం 45 శాతం మేర విద్యార్థులు బడులకు వెళ్లేవారని, ప్రస్తుతం అన్ని రకాల వసతులతో కార్పొరేట్ పాఠశాలలను మరిపిస్తున్నాయని చెప్పారు. ఆధునిక విద్యనందించడంలో భాగంగా 8వ తరగతి నుంచే పిల్లలకు ట్యాబ్‌లతో పాటు ఇంగ్లిష్ విద్యను అందించడం వల్ల వందకు వందశాతం మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5లక్షలు పరిమితిని రూ.25 లక్షలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో ప్రజారోగ్యానికి ధీమా లభించిందన్నారు. దీంతో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రతి పేదోడు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపలోనూ పేదలందరినీ లక్షాధికారి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపింది జగనన్నే అని చెప్పారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కౌతాళం : ప్రణాళిక ప్రకారం రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం కాచాపురం సర్పంచు జయమ్మతో కలిసి కౌతాళం సచివాలయం-2 పరిధిలో జెకెఎల్‌ఎస్ నగర్, ఎన్టీఆర్ నగర్, ఇందిర్‌నగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన తీరును తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందలన్న లక్ష్యంతో నవరాత్నలను ప్రవేశపెట్టి అర్హులందరికీ అందజేస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో ఇంత స్వేచ్ఛగా పథకాలు అందాయా అని స్థానికులను ప్రశ్నించగా.. లేదు అన్ని వారు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని మీరే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలిపించుకుంటే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని చెప్పారు. పారదర్శక పాలనలో భాగంగా గ్రామ/వారు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తెచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జెకెఎల్‌ఎస్ నగర్‌లో తాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి త్వరలోనే పూనుకుంటామన్నారు. ఆంజనేయస్వామి ఆలయ పూజారి నర్సప్ప తనకు ఉన్న దేవుని మాన్యం అన్యక్రాంతమైందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాడు. అలాగె రెవెన్యూ అధికారులు తన భూమిని సర్వే చేయడం లేదని వాపోయాడు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి వేతనం అందేలా చూడాలని, వెంటనే పొలం సర్వే చేసి, అన్యక్రాంతమైన భూమి ఆయనకు అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచు పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జేసీఎస్ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, పీఎంసీ చైర్మన్ వడ్డె రాము, మాజీ సర్పంచ్ అవతారం, ఉప సర్పంచ్ తిక్కయ్య, రాజాఅహ్మద్, అబ్దుల్‌సమద్, భీమేష్ పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో అవినీతి రహితంగా రాష్ట్రం





38వ వార్డులో డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం, హాజరైన మహిళలు

ఆదోనిటౌన్: జగనన్న పాలనలో రాష్ట్రం అవినీతిరహితంగా పేరుగాంచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయడంతో దళారీ వ్యవస్థను నిర్మూలించారని, అలాగే అవినీతికి ఆస్కారం లేకపోవడం, నిధులు దారిమళ్లడం జరగడం లేదని దీంతో పేదలకు సంపూర్ణ లబ్ధి చేకూరుతుందన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 36వ వార్డు టీజీఎల్ కాలనీ, 38వ వార్డు హనుమాన్‌నగర్‌లో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ, ప్రదర్శన, డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు, అనంతరం ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి దోచుకుకోవడం దాచుకోవడం జరిగిందని విమరించారు. 36వ వార్డులో రూ.17.34 కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు వెచ్చించామన్నారు. 38వ వార్డులో రూ.20.50 కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగిందని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ ఎరుకల లక్ష్మి, లోకేష్, తికన్న, వీరాంజనేయులు, తాయన్న, ఫరూక్, రామాంజనేయులు, అన్నపూర్ణమ్మ, చిట్టెమ్మ, షారుక్, హమీద్ పాల్గొన్నారు.



17వ వార్డులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

**17వ వార్డులో**

ఆదోనిఅర్బన్: పట్టణంలోని 17వ వార్డు ఇన్‌చార్జి తాయన్న అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బోయ శాంతమ్మ, జేసీఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జిలేకాబీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఇన్ని పథకాలు గతంలో అందిన దాఖలాలు లేవన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో జగనన్న కొత్త చరిత్ర సృష్టించారని కొనియాడారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కన్వీనర్లు శ్రీనివాసులు, బసవరాజు, గృహసారథులు పాల్గొన్నారు.

### విద్యార్థి బస్సు నడపండి

ఆదోనిఅర్బన్: గజ్జహళ్లి విద్యార్థుల కోసం బస్సులు నడపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆలూరు నియోజకవర్గంలోని గజ్జమళ్లి గ్రామ విద్యార్థులు బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా రధాన కార్యదర్శి రామలింగను సంప్రదించగా వారు ఆదోని డిపో అసిస్టెంట్ మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. నీలకంఠ, అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామం నుంచి ఆదోని విద్యార్థులు వస్తున్నారని బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని విద్యాలయాల వేళకు బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు మహ్మద్ అలీ, శివకుమార్, దేవరాజ్, రవికుమార్, శరణకుమార్ పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించండి

కౌతాళం: అంగన్‌వాడీ టీచర్ల సమస్యల్ని పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. 9వ రోజు బుధవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీగా వెలుగు కార్యాలయానికి వెళ్లి ఏపీఎం రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

### పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండలంలోని దిబ్బన దొడ్డి గ్రామానికి చెందిన బోయ పెద్ద హనుమంతు సెప్టెంబర్ నెలలో అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి పరిహారం మంజూరు చేయించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహం వద్ద ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.7లక్షల పరిహారం చెక్కును ఎమ్మెల్యే మృతుడి భార్య శాంతమ్మకు అందించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, ఏఓ జీరా గణేష్ పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ అందజేత

కౌతాళం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా పబ్లిక్ పరీక్షల నమూనా మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు వరప్రసాద్, శోభారాణి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఈ మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. హెచ్ఎం ఇమ్మానియేల్, యుటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

### పోటీలను విజయవంతం చేయండి

కౌతాళం: ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రతిష్మాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. బుధవారం పోటీల నిర్వహణపై కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి జరిగే పోటీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులందరూ పాల్గొనేలా చూడాలని, అలాగే మైదనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని చెప్పారు.

### దాణా పంపిణీ

కోసిగి: రైతులు వ్యవసాయంతో పాటు పడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డిప్ సంస్థ కార్యకర్త భీమేష్ సూచించారు. బుధవా రం మండలంలోని పల్లెపాడు గ్రామంలో పాడి పశు వుల సంక్షేమం కోసం ఆ సంస్థ ఆధ్వర్యంలో దాణా పంపీణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్ర , వెటర్నరీ అసిస్టెంట్ హైమావతి, రైతులు పాల్గొన్నారు.

### ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు



కేక్ తినిపించుకుంటున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఎస్పీ శివనారాయణమూర్తి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రోషన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అధ్వర్యంలో సపోస్ క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ శివ నారాయణమూర్తి హాజరై క్రిస్మస్ విశిష్టతను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సంఘం సభ్యులు సుధాకర్, చెన్నయ్య, అమర్నాథ్, దేవాదానం, లూర్థయ్య, న్యూటన్‌రాజ్, జాన్సన్, చిన్న, మధు, దీపక్, భాస్కర్, ఆదిమూర్తి, కిరణకుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.









### తురువగల్లు కొండల్లో చిరుత సంచారం

ఆస్పరి: మండలంలోని తురువగల్లు కొండల్లో చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. తురవగల్లుకు చెందిన నల్లన్న గొర్రెల మందను పొలంలో నిలిపిఉంచారు. మంగళవారం రాత్రి గుంపులోని గొర్రె పిల్లను చిరుత నోట కరచుకుని లాక్కెళ్లి చంపి తినేసింది. బుధవారం ఉదయం యజమాని నల్లన్న సమీపంలోని పొలంలో చిరుత సగం తినేసిన స్థితిలో పడినున్న గొర్రె పిల్ల కళేబరం చూసి ఆందోళనకు గురయ్యారు. తురువగల్లులో నాలుగు గొర్రెలను చిరుత చంపి తినేసిందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు, గొర్రెలు, పశువుల కాపరులు భయపడుతున్నారు.

### కుప్పగల్లు, పెద్దతుంబళంలో 'వికసిత్ భారత్'

ఆదోనిఅర్బన్: మండలంలోని కుప్పగల్లు, పెద్దతుంబళం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం అందించే 17 సంక్షేమ పథకాలను వివిధ శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. బీజేవైఎం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ ఆచారి పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం అర్హులైన వారికి మంజూరైన ప్రధానమంత్రి ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అందజేశారు.

